# పాదాభివందనం

ప్రతిరోజూ సాయంకాలం అయ్యే సరికల్లా మనస్సు అటు వేపుగా పరిగెత్తుతుంది. చేతులు యాంత్రికంగా అలంకరిస్తాయి. మనస్సులో కలిగే పరవళ్ళకి దీటుగా అలంకారం సాగదు. గుండెలో కదలే కదలికకి రాగమాధురులు వచ్చినట్టుగా, స్వరతరంగాలపై జీవితం ప్రవహించినట్టుగా ఆమె అందానికి తగినట్టుగా అలంకరణ సాగదు. కుదురుగా ఉండే శిరోజాలు సెలయేటి తరగలపై తేలియాడే పిల్లగాలుల్లా కదలాడుతాయి. సూర్యోదయం వేళ రవిబింబం మెరిసినట్టుగా నుదుట సిందూరం వెలుస్తుంది. రాగభావనకే కెంపులై పోయే చెక్కిళ్ళకి ఏ గంధమూ అందాన్నివ్వటం లేదు. రాగరంజితాలై పగడపు మొవ్వల్లా మెరిసే పెదాలకి ఏ రాగమూ అంటటం లేదు.

చేసుకున్న అలంకరణ తృప్తి నివ్వదు మనసు నివ్వదు. కాళ్ళు త్వర పెడతాయి. కళ్ళు ఆశ పడతాయి. గుండె గుబులెక్కుతుంది.

'ఎక్కడికమ్మా?'

సరిగ్గా గడపదాటే వేళకి ఏకైక పుత్రిక ప్రియం వద పలకరిస్తుంది.

అవును! ఈ దేశంలో ఏ ఆడదీ గడప దాటు కూడదు. కారణం లేనిదే చరణం కదలరాదు.

ఎగసెగసి పడుతున్న ఊహల అలలు ఒక్కసారిగా ఆగిపోతాయి. ప్రేమ సంద్రం నిస్పంద్రం అవుతుంది. కళ్ళల్లో మిలమిలలు కొలనిలోని చేపల్లా అక్కడే ఆగిపోతాయి.

'అలా చెరువు గట్టుకి.....' యథాలాపంగా జవాబిస్తుంది.

'నేనూ వస్తానమ్మా,'

కూతురి అభ్యర్థనని త్రోసిరాజన లేదు. పది హేనేళ్ళుగా ప్రాణానికి ప్రాణం ఇచ్చి పెంచిన ఆత్మీయత అడ్డు చెప్పలేదు.

కానీ వెన్నెల రహదారుల్లో బ్రతుకంతా ఒక్క నేడే వెన్నెల పంట అన్నట్టుగా చకోరిలా పయనించ బోయే తనకే ఉస్సూరుమంటుంది మనస్సు.

ఆ వేళకి ప్రేమజీవన్ ఇంట్లో ఉండడు. ఆటలు ఆడుకునేందుకి వెళ్ళి ఉంటాడు. భువనేశ్వర్ ఇంకా ఇంటికి వచ్చి ఉండడు. ఉద్యోగ బాధ్యతలు ఆయన్ని ఒకపట్టాన ఇల్లు

చేరనివ్వవు. ఆయన ఇంట్లో అడుగు పెట్టేవేళకి ఆంగ్లంలో వార్తలు ప్రారంభమవుతూ ఉంటాయి.

అంతటి బంగళాలో ఇద్దరే తల్లి కూతుళ్ళు - సాయం దీపాల్లా బిక్కు బిక్కుమంటూ కూర్చోవాలి. ప్రియంవద పుస్తకాల పురుగు. అదీ ఇదీ అని లేదు. వార, మాస పత్రికలతో పాటు ఏ నవల అయినా సరే! తెలుగో, ఆంగ్లమో ఏదయితేనేం రోజు కొత్త పుస్తకం చదివెయ్యాలి. అదంతా మనస్సులో ముద్ర పడిపోవాలి. కొత్త పుస్తకం లేకపోతే తోచదు. చదవక పోతే దిక్కు తోచదు.

భువన మాత్రం సాయంకాలాల్లో బయట పచ్చికలో పడక కుర్చీ వేసుకుని కూర్చుంటుంది. చుట్టూ అందంగా విరిసిన పూలు - ఆ పూలపై ఆరాటంగా వాలే తుమ్మెదలు - గాలికి కదిలిపోయే చిగురుటాకుల సొరులు - చిరు చిరు సవ్వడికైనా చలించిపోయే అతి ప్రశాంతత.

కొండ దిగిపోయే సూర్య బింబాన్నీ, కొండెక్కి వచ్చే చంద్ర బింబాన్నీ చీకటిని వేయి కిరణాలతో పారదోలబోయే సైనికుల్లా వెలిగేనక్షత్ర మాలికలనో చూస్తూ గడపటం అలవాటామెకి.

కానీ, వారం రోజుల నాడు అనుకోకుండా చెరువు గట్టుకి వెళ్ళవలసి వచ్చింది, ఏదో వ్రతం. ఉద్యాపన అయింది. ఆ సమిధలు, ఆ అక్షింతలు ఆ పూజా పుష్పాలు అన్నీ నీటిపాలు చెయ్యాలి. తొక్కే చోట, తొక్కుడు ఉండే చోట వేయకూడదు. అది అపచారం.

పని మనుషులని పంపకూడదు. భర్త ఆ సమయంలో ఇంట్లో ఉండరు. కొడుకు ఆటలు, కూతురి చదువు.

తప్పనిసరిగా అడుగు బయటికి పెట్టింది భువన.

సాయంకాలం అందాలన్నింటినీ తన గర్భంలో దాచుకుంటుంది. చెరువు. ఎర్రగా మెరుస్తూన్న కలువలు, తెల్లగా వెలుగుతూన్న తామరలు, నీటిని కప్పేసేట్టుగా అల్లిబిల్లిగా అల్లుకుంటున్న తామరాకుల తీగలు - చిరుగాలుల సవ్వడికి బెదరిపోయి కదలిపోయే నీటి కన్నె -

నయనాభి రామంగా కనిపించింది భువనకి

ఇంత అందం దాచుకున్న ఈ చెరువుని తను ఇన్నాళ్ళూ చూడలేదా! ఇక్కడికి బదిలీ అయి వచ్చి నాలుగేళ్ళయింది.! ఏనాడూ ఇటు రాలేదు. వచ్చే అవసరం లేదు. అవకాశమూ లేదు.

మనుషులు తమ చుట్టూరా ఉన్న అందాన్ని చూడలేరేం! ఎక్కడో అందాలున్నాయని భ్రమపడి వాటికోసం పరుగెడతారేం!

'నమస్తే '

ఉలికి పడింది భువన.

మేళవించిన వీణపై రిషభం మోగినట్టుగా ఉందాగొంతు. కోయిల గండూషించినట్టుగా ఉందా పిలుపు. మగతనం, రాచఠీవి, స్వరమాధురి, రసజీవనం, రాగభావన కలబోసినట్టుగా ఉందా స్వరం.

చప్పున తిరిగి చూసింది.

అందం ఆకృతి దాల్చినట్టు, గాంధర్వ విద్యకదలి వచ్చినట్టు ఉన్నాడతను. పైరగాలికి చెల్లా చెదురుగా పరిగెత్తే మేఘమాలికల్లాంటి ముంగురులు నుదుటి మీద నర్తిస్తున్నాయి. సితారా శ్రుతి చేసినట్టుగా ఉండే నాసిక, పారాణి అద్దినట్టుండే పెదాలు, ప్రేమ భాష్యాలకు గనులుగా ఉన్నట్టున్న కళ్ళు - నునుపైన చెక్కిళ్ళు.

క్షణంపాటు తనని, తన వయస్సుని, తన హోదాని, తన మనస్సుని మరచి పోయింది భువన.

'నమస్కారం' మళ్ళీ అన్నాడతను. కోవెల్లో ధ్వజస్తంభంపై ఎలకోయిల వాలితే కలిగే చిరు మువ్వల సవ్వడి.

'నమస్కారం' తడబాటుగా, ఏనాడూ తడబాటు ఎరుగని భువన అంది.

'మీరు ఇక్కడికి కొత్తగా వచ్చారా?'

'ఊఁ! ఊఁ ఉహూఁ.' పురి విప్పని నెమలిలా గొంతు విచ్చుకోవటం లేదు.

'ఎన్నడూ ఇంత అందాన్ని చూడలేదా?' ఉలికి పాటుతో అతని వైపు చూసిం దామె. ఆ కళ్లల్లో కొంటెదనం లేదు. కవ్వింపు లేదు. గంభీరంగా, ప్రేమసాగరం లాగా ఉన్నాయి ఆ కళ్ళు.

ఆమె జవాబు ఆశించకుండానే 'ఈ వూరి జనానికి ఈ అందం తెలియదు. అందుకే ఎవరూ రారు. చూడండి! ఆ సూర్యబింబం ఎలా ప్రతిబింబిస్తోందో! ఎవరో భగ్న ప్రేమికుడు తన గుండెని తీసి విసిరేసినట్టుగా లేదూ! ఆ కలువలు చూడండి! దారి తెలియని ప్రేమపావుల్లా లేవూ! అన్నాడు.

ఆ కంఠంలో ఉద్వేగం ఉంది. భావుకత ఉంది. 'మీరేం చేస్తారు? అడిగింది.

'పోలీసు శాఖలో -

చప్పున మరోసారి చూసింది. మరు భూమిలో మల్లె తీగలా! ఉప్పునీటి బావిలో అమృతపు వూటలా! కాకి గుంపులో కోకిలా ఇతడు!

'ఆశ్చర్యంగా ఉందా మీకు! నేను అనుకున్న దొకటి, జరిగిం దొకటి! కర్తవ్యపాలనకి ఏదయితేనే అనుకుని చేరిపోయాను.'

'అదృష్టవంతులు-'

'ఎందుకు?' ఆ గొంతులో కొద్దిగా కుతూహలం.

'ఉద్యోగానికి మనస్సొప్పుకోలేదు. బానిసత్వం బానిసత్వం అంటారు కానీ మన వాళ్ళకి ఇంకా ఈ మానసిక బానిసత్వం పోలేదు. గొడ్డులా చాకిరీ చెయ్యటం, డబ్బు సంపాదించటం, దాచుకోవటం, సుఖం అనుకుని సుఖం కాని దాని వెనుక పరిగెత్తటం...' చప్పున ఆగిపోయింది. క్షమించండి .కొత్త వారయినా రాగరంజిత మనస్కులని, భావుకులని మాటాడేను' అంది క్షమాపణగా.

చిన్నగా నవ్వేడతను. ముద్ద మందారాలు విచ్చుకున్నట్టుగా అతని పెదాలు విచ్చుకున్నాయి.

'మీరు -'

'మా వారు' - చెప్పింది.

'అరె! ఆయన నాకు బాగా తెలుసు, మా ఇంటికి ఎన్నోసార్లు వచ్చారు. మరి నన్నొసారయినా 'మీ' ఇంటికి పిలువలేదు. అన్యాయం. ఇంత మంచి భావుకతగల మీతో జీవితం పంచుకున్న ఆయన అదృష్టవంతుడు -'

ఆమె గుండెలోంచి వేడి నిట్టూర్పు సెగలా తన్నుకొచ్చింది. 'తను అదృష్ట వంతురాలా! ఆయన అదృష్ట వంతుడా? ఏది అదృష్టం దానికి కొలబద్ద ఏది?

మీరు పాడగలరా?' అడిగాడతను. అతని ధోరణి కొత్తవారితో మాటాడుతున్నట్టుగా లేదు. జన్మ జన్మల స్నేహితురాలితో ప్రతిరోజూ కలిసి మాటాడుకునే ధోరణిలో ఉంది.

'మీరు?' చప్పున అడిగింది. అతని ఒక్కొక్క ప్రశ్న తన మనస్సులోని ఒక్కో పొరని వెలికితీస్తున్నట్టుగా ఉంది. గత జన్మ వాసనలు పరిమళభరితాలై స్మృతి పరిమళాలని వలపు సితారాలపై అతి మనోజ్ఞంగా మంద్రస్థాయిలో వినిపిస్తూన్నట్టుగా ఉంది. ఆ హాయి-

'నాకు పాడటం రాదు. కానీ వేణువు వాయించగలను. వీణతో పరిచయం ఉంది. సంగీతమంటే ప్రాణం పెడతాను. సాహిత్యమంటే ఆకలి దప్పులు మరచిపోతాను.కృష్ణశాస్త్రి గీతాలు, విశ్వనాథ కిన్నెరసాని పాటలు, బాపిరాజు గేయాలు నాకు చాలా ఇష్టం. క్షేత్రయ్య పదాలు విని పరవశిస్తాను -' తన అంతర రూపం పరిచయం చేసుకున్నాడు.

చీకట్లు మెల్లిమెల్లిగా దిగుతున్నాయి. వెన్నెల మెట్లెక్కి వస్తూన్న నెలరాజు,చంద్రికలా నవ్విందామె మెల్లగా.

'ఒకప్పుడు పాడేదాన్ని - వీణ అభ్యసిస్తూ, త్యాగ రాజస్వామి కీర్తనలు, అన్నమయ్య పాటలు, మీరాభజనలు, అష్టపదులు పాడేదాన్ని.'

'మూగపోయారా ఇప్పుడు?'

'సంసార బంధం మూగదాన్ని చేసింది.'

'ఒక గాయని హత్య చేయబడిందన్న మాట. అతని కంఠంలో కరుకుదనం ధ్వనించింది.

'మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కాదు.' చప్పున అంది భువన. వెంటనే నాలిక్కొరుచుకుంది తన తొందర పాటుకి.

ఆమె చమత్కారాని కతను తేలిగ్గా నవ్వేశాడు.

'క్షమించండి.'

'ఫరవాలేదు సఖ్యం సాప్తదీనం - మనం కలిసి ఏడడుగులు నడవకపోయినా మన మాటలు ఏడు గడియలు కలిశాయి. స్నేహంలో తప్పులేదు.

ఇద్దరూ కొన్ని నిమిషాల సేపు బాహ్య ప్రపంచాన్ని మరచిపోయి నట్టుగా మాటాడుకున్నారు.

'చీకటి పడింది - వెన్నెల వచ్చింది -'

కంగారు పడింది భువన.

'సెలవు - ఇంటికి వెళతాను.'

'నమస్కారం.....ఎప్పుడైనా రండి. భువనేశ్వర్‌తో పాటే.'

'మీ ఇల్లాలు......'

అతని గుండెలో వియోగ వీచికలు హోరుమన్నాయి. అతని ముఖం మ్లానమైంది. గొంతు కొన్ని క్షణాలు మూగపోయింది. 'ఆవిడ లేదు. స్మృతిగా ఒక బాబుని వదలి వెళ్ళింది. పదిహేనేళ్ళయింది. బాబు చదువుకుంటున్నాడు. నేను ఒంటరి వాడిని, తీపిరాగాలు పలకని ప్రేమసితారా నా జీవితం. అపస్వరాలు పలికే వీణ నా బ్రతుకు.'

'అయ్యో!' జాలిగా, ప్రేమగా అంది.

'పోనివ్వండి భగవంతుడు అందరికీ సుఖాన్ని, సంతోషాన్ని పంచి ఇవ్వడు. కొందరి సొత్తుగా భోగ భాగ్యాలని ఇస్తే, మరి కొందరికి కష్టాలని పంచి ఇవ్వాలి. నాలాటి వాళ్ళు లేకపోతే కష్టాలు ఎక్కడికి వెళతాయి?'

ఆమె మనస్సు కరిగి పోయింది.

'మీ పేరు........

చప్పున తలెత్తి చూసింది - గుండె పలుకు వినిపించేంత తీయని కంఠం.

'భువన - భువన మోహిని - అంతా భువన అనే అంటారు.'

'నా పేరు రజనీ తిలక్ - అంతా తిలక్ అంటారు.'

రెండు జతల కళ్ళు క్షణంపాటు కలుసుకుని విడిపోయాయి.

ఆమె తన ఎద మెత్త దనమంతా వెలికి వచ్చినట్టుగా 'సెలవు - వెళ్ళొస్తాను' - అంది.

'నమస్తే' అన్నాడు రజినీ తిలక్. భువన మోహిని ఇంటికి మరలింది.

ముందు నడుస్తూన్న ప్రియంవద ఆగింది.

తనలో తనే ఆలోచించుకుంటున్న భువన మెల్లిగా నడుస్తూంది.

'అమ్మా'

కూతురి పిలుపుకి ఉలికి పడిందామె. ఆమె మనస్సులోని ఆలోచనా తరంగాలు నిస్తరంగా అయ్యాయి. 'ఊ' అంటూ కదలింది.

✧ ✧ ✧

ఎప్పటిలాగే ఆమెకళ్ళు నిస్పృహతో, నిరీహతో వాలి పోయాయి. వారం రోజుల నాడు అకాల వసంతం లాగా కరుణించి కన్పించిన అతను మళ్ళీ ఈ వారం రోజులుగా కనిపించనే లేదు. ఏదైనా ఉద్యోగ బాధ్యతతో ఎటైనా వెళ్ళాడా? లేక వూళ్లోనే ఉండి రావటం లేదా? అంతుపట్టలేదు భువనకి.

'రోజూ నువ్వు వచ్చేది ఇక్కడికేనా, అమ్మా! 'ఊ'

'నాకు భలే కోపంగా ఉంది - తెలుసా!'

'ఎందుకట?'

'నువ్వు రోజూ వచ్చేది ఇక్కడికే అని చెపితే నేనూ వచ్చేదాన్ని. ఎంత అందం! ఏం అందం! ఈ గాలి, ఈ పూలు, ఈ నీళ్ళు, ఈ గలగలలు, ఈ కదలికలు..... ఓహ్.....సహజ సుందరం.'

'నీవు, నీ పుస్తకాలు, నీ శరత్, నీ విశ్వనాథ, నీ సులోచన - వాళ్ళంతా ఎక్కడికి వెళతారు-

'ఇక్కడ కంటితో ఇంత అందాన్ని చదవ గలినప్పుడు అక్కడి అందాలు తాత్కాలికంగా లేక పోయినా ఫర్లేదు. సూర్యాస్తమయం ఎంత అద్భుతంగా ఉంది, అమ్మా! ఏ ఆరకులోయలోనో, ఏ కన్యాకుమారిలోనో, ఏ భీమ్లిలోనో - ఎక్కడనో చూడవలసిన అందాలు ఇక్కడ యీ నంద్యాల్లో చూస్తున్నాము.'

భువన ఏమీ మాటాడలేదు. ఆ చెరువు నీళ్ళలో కదలాడే చేప కళ్ళలాగే ఆమె కళ్ళు 'ఆయన' కోసం ఎదురు చూస్తున్నాయి. 'నీవు రావు నింగి రాదు' అన్నట్టుగా ఉందామెకి.

'వందనాలు'

గండు కోయిల షడ్జమంలో పలికి నట్టైంది. ప్రేమనాదం, వేదనాదం జంట స్వరాల్లాగా వినిపించి నట్టైంది.

ఇద్దరూ చప్పున తిరిగి చూశారు.

పొందూరు జరీ అంచు ఖద్దరు ధోవతి, తెల్లటి ఖద్దరు చొక్కా - స్వచ్ఛతకి ప్రతిబింబం లాగా ఉన్నా డతను. నుదుట పొడవుగా ఉండే ముంగురులు సాయం సమయ పిల్లకలకి అలా అలా కదలాడుతూ ఉన్నాయి.

భువన కళ్ళు నెలరాజుని చూసిన కలువ మోములా విచ్చుకున్నాయి. అప్రయత్నంగా 'నందనం' అని, 'ఇన్నాళ్ళూ కనిపించ లేదేమిటి? అంది. ఆ కంఠంతో స్నేహ వాత్సల్యాలు తొంగిచూసే నిష్ఠూరం - దర్శనానికై వస్తే కనిపించకపోతే కలిగే ఆశాభంగం వినిపించాయి.

జవాబుగా నవ్వే డతను.

'మా అమ్మాయి ప్రియంవద.....'

'నమస్కారం.....' గౌరవభావం ఉట్టిపడే గొంతుకతో అంది.

'మీ అమ్మాయా?' అతని కంఠంతో దాచినా దాగని ఆశ్చర్యం. ఆ కళ్ళలో మీకింత వయస్సున్న కూతురున్నదా అన్న భావం. ఆమె అందానికి, శరీర లావణ్యానికి, సౌష్ఠవానికి, ఆ సౌష్ఠవాలని కాపాడుకుంటున్న ఆరోగ్యానికి అభినందనలు కనిపించాయి ఆ కళ్ళలో.

భువన ఏమీ అనలేదు.

నిశ్శబ్దం ఏరులా ప్రవహిస్తూంది.

మాటల కందని ఆత్మీయత, మనస్సులకి మాత్రం తెలిసే రాగభావన ఇద్దరి మధ్య ప్రవహిస్తూంది.

'మా ప్రియ పుస్తకాలు బాగా చదువుతుంది.' 'అవునా! అన్నట్టు చూశా రాయన.

ప్రియంవద ముఖంలో సహజమైన సిగ్గు తారట్లాడింది. అది భేషజానికి తెచ్చి పెట్టుకున్న సిగ్గు కాదు.

'చదవటమే కాదు, బాగా విమర్శిస్తుంది. విశ్వనాథ వారి భావుకత, శరత్ స్త్రీ మనోచిత్రణ, యద్దనపూడి మధ్య తరగతి స్త్రీల మనస్సుకి పట్టే అద్దం లాటి రచనా విధానం, చలం శైలి, లతధైర్యం - ఇలా ఇలా చెబుతుంది.

'వూరుకోమ్మా!'

'అంకుల్ కూడా బాగా చదువుతారమ్మా.'

'మీ వద్ద ఏయే పుస్తకాలు ఉన్నాయి, అంకుల్?'

'ప్రబంధాలు, నవలలు, నాటకాలు, ప్రహసనాలు, చెకోవ్, గోర్కీ, మామ్ హెరాల్డ్ రాబిన్స్, టాగోర్, ఆర్కే నారాయణ్.......'

ప్రియంవద కళ్ళు విచ్చుకున్నాయి ఆశ్చర్యానందాలతో.

'నువ్వు విదేశీ - ముఖంగా ఇంగ్లీష్, రష్యన్ సాహిత్యం చదవాలమ్మా.'

'అలాగే నండీ. మా నాన్నగారు చదవరు. అమ్మ మానేశారు. ఎప్పుడూ మవునం.

తను వీణ వాయిస్తా రట. నాకు నేర్పుతున్నాను. ఉఁ హూఁ - కనీసం వినిపించవందే! అవునా, అంకుల్ ఒక సందేహం. భర్తకి ఇష్టం లేకపోతే దేన్నయినా వదిలెయ్యాలా?'

'ఆ!, కాపురాన్ని తప్ప', తమాషాగా అన్నారాయన. ఫక్కున నవ్వింది ప్రియంవద. 'అదొదిలేస్తే భర్తతో పేచీలేదు. మా నాన్నగారికి సంగీతం గిట్టదు. ఆయన సినిమాలు చూడరు. రికార్డులు వినరు. నాట్యాలు చూడరు. పుస్తకాలు చదవరు.

భువనేశ్వర్ అదో తరహా వ్యక్తి.

'కానీ సిగరెట్స్ విపరీతంగా కాలుస్తాడు.' కోపంగా అంది ప్రియంవద. తండ్రిగారు ఆయనకీ పరిచయమే అని తెలియటంతో ఆ మాట అంది, 'మా అమ్మ పదిహేడేళ్ళ కాపురంలో ఆయనతో వాటిని మాన్పించ లేక పోయింది.

'క్లబ్బుకి వెళ్ళకుండా ఆపలేక పోయింది.'

'అవును. ఆ రెండూ ఆమె చేయలేదు. 'ప్రియంవద అంది.

'ప్రియా!' మందలింపుగా అంది భువన.

'మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు?' ప్రియ ప్రశ్నించింది.

ఆయన భువన వైపు చూశారు. తలొంచు కుందామె. అయితే ఆ అరక్షణంలోనే ఆయన ఆమె కళ్ళలోని భావాన్ని చదివారు. వసంతం కోసం శిశిరంలో తపించిన చెట్లలాగా, గ్రీష్మంలో తపించిన నదీ కన్యలు వర్షం కోసం ఎదురు తెన్నులు చూసినట్లుగా ఆ కళ్ళలో ఆర్తి కనిపించింది.

'ఎప్పుడైనా వస్తాను.'

రేపొస్తారా? మా అమ్మ పుట్టిన రోజు. చప్పున అంది.

'తప్పకుండా వస్తాను.' ఆ గొంతులో ఒక పర్వదినం రోజున పరమేశ్వరిని దర్శనం చేసుకోబోయే ఆర్తి కనిపించింది.

ప్రియంవద 'అభిజ్ఞాన శాకుంతలం'లో శకుంతల మనస్సుని గురించి అడిగింది చప్పున. సంబంధం లేని ప్రశ్న. హఠాత్తుగా అడిగింది. రజనికి శకుంతల అంటే ఎంతో అభిమానం కాళిదాసు మర్మజ్ఞత అంతా వివరించాడు అతను. అభిజ్ఞాన విషయం ఏకరువు పెట్టాడు.

'మీరు గొప్ప భావుకులు' అంది భువన చప్పట్లు చరిచింది ప్రియంవద.

'నువ్వు శకుంతల నెచ్చెలివికదా! అందుకే ఆ ఆనందం!' నవ్వుతూ అన్నాడతను.

'కృష్ణశాస్త్రి గీతాలు చదివారా?'

'పిచ్చిపిల్ల! అనుకున్నారాయన. 'క్షేత్రయ్య సారంగపాణి, కృష్ణశాస్త్రి, సినారె, వేటూరి, వీళ్ళంతా భ్రష్ట యోగులు, సభ్యశృంగారాన్ని భక్తి పరంగా భగవంతుడికి అంకితం చేసిన

మహానుభావులు, అన్నీ పాటలా వదిలేయ్, మనసున మల్లెలు మాలలుగా వూగించగలిగిన వూహాల శాస్త్రి గారొక్కరే.'

'మీరు గొప్ప విమర్శకులు,' మెచ్చుకోలుగా అంది.

తన మనస్సులోని భావాలకు ప్రతిబింబాలన్నట్టుగా అతను మాటాడుతూ ఉంటే పరవశించి వింటూంది భువన.

'వెళదామా! చీకటిపడింది' అన్నారాయన. ముగ్గురూ లేచారు.

'మళ్ళీ ఎప్పుడు! అన్నట్టుగా చూసింది భువన.

✧ ✧ ✧

సాయం సమయం ఇంట్లో ఎవరూ లేరు. పుట్టిన రోజున వచ్చి ఈ రోజు వస్తానని చెప్పి వెళ్ళాడు రజని. ఎదురుచూస్తూ కూర్చుంది భువన.

సరిగ్గా ఆరింటికి వచ్చా డతను.

కళ్ళు స్వాగతం చెప్పాయి. తోటలోనే కూర్చున్నా రిద్దరూ. ప్రశాంతత భంగపడని ఏకాంతం.

'మోహినీ! ఆ గొంతులో యుగ యుగాల ఆర్తి.

ఉలికి పడింది ఆమె. తొలినాడే, తొలి చూపులోనే, తొలి పరిచయంలోనే ఈ పరిస్థితి తప్పదని వూహించిం దామె. ముప్పయి మూడేళ్ళ వయస్సులో ఏనాడూ మనస్సు ఎవరి పాదాల ముందూ పారవేసు కోని ధీరగంభీర హృదయ భగవంతుని లీలలు చిత్రమైనవి. వూహ తెలిసిన నాటి నుంచీ అలా పిలిపించు కోవాలనే ఆశ. అదెన్నడూ తీరలేదు. ఆ కోర్కె తీరకుండానే పోతానేమోననుకునేది.

'నన్ను క్షమించు - దాదాపు నాలుగు పదుల వయస్సు నాది. అనుభవంలో అనుభూతి రసించి, నీరసించిపోయింది. ఆధ్యాత్మ పథాలవైపు పరిగిడే మనస్సు ఈ నెల రోజులుగా రాగభావనలతో నిండి పోతోంది. యౌవనం తొలిదశకి వెళ్ళిపోతున్నాను. నిన్ను పలకరించేదానికి ముందు పదిహేను, ఇరవై రోజులుగా ఎంతో తపనపడ్డాను. తొలి చూపులోనే ప్రేమించాననటం ఒక్క యువకులకే పరిమితం కాదని తెలుసుకున్నాను. మన వయస్సులేమిటి? మన స్థితు లేమిటి? సాంఘికంగా మన స్థాయి ఏమిటి?

కానీ, మోహినీ, మనస్సు ఇవన్నీ ఆలోచించదు. నీవు, నీవు అంటూ కలవరిస్తోంది. నీ సన్నిధికోసం తపిస్తోంది. నీ దర్శనంకోసం ఆరాటపడుతోంది. నిర్మోహమైన ఈ ఆర్తి - స్వచ్ఛమైన ఈ అనురాగం లోకం దృష్టిలో ఎలా ఉంటుంది.? నువ్వేమనుకుంటావ్? మనస్సు విప్పలేను. విప్పకుండా ఉండలేను. అందం, హృదయ సౌందర్యం, భావుకత, రసలోలత్వం - అన్నీ మూర్తీభవించిన నీ సన్నిధికి రాలేకుండా ఉండలేక పోతున్నాను. ఇన్ని సంవత్సరాలుగా

సాధించిన మనో నిగ్రహం పటాపంచలై పోయింది.

ఆర్తిగా విన్నవించుకుంటున్నాను. ఆపార్థం చేసుకుని తిరస్కరిస్తే ఈ జన్మకు భాగ్యం లేదను కుంటాను. అర్థం చేసుకుని స్వీకరిస్తే ప్రేమ ఫలించిన ప్రేమపూజారిలా, తపస్సు ఫలించిన భక్తుడిలా ఆనందిస్తాను.

ఏ ఉద్వేగమూ లేని కంఠంతో భగవతీ చరణారవిందాలకి, భ్రమర వాసినీ పదారవిందాలకి విన్న వించుకునే భక్తుడిలా అన్నాడు.

నిర్హేతుక జాయమాన కటాక్షంతో పరమేశ్వరుడు సాక్షాత్కరించినట్లయింది. భువన మోహినికి. తన గుండె లయ తప్పుతున్న వేళ సవరించినట్లు ప్రేమగా వరించినట్లు అనిపించింది.

'రజనీ!' ఆమె గొంతులో ప్రేమ పారావతాలు గిరికీలు కొట్టాయి.

'ఇది నే నెన్నడూ అనుభవించని స్థితి. చదువు కునే రోజుల్లో, సంగీతం అభ్యసించిన వేళల్లో, కన్నెగా నేను కలలు కన్న రోజుల్లో నేను కన్న కలలన్నీ రూపు దాల్చినట్టు నీవు ఎదురయ్యావు. జీవితంలో ఏనాడూ ఇంత అదృష్టం పడుతుందని అనుకోలేదు. ఇలా ఆకాల శరత్ జ్యోత్స్న కెరటాలు విరిగి పై బడతాయని వూహించనేలేదు.

ప్రశాంతమైన కాసారంలో అలలు రేగి నట్లయింది. మనస్సు నిగ్రహించుకోలేను. ధర్మ మార్గం అతిక్రమించలేను. నీ పాదాల ముందు ఆత్మార్పణ చేసుకోకుండా ఉండలేను. నిన్ను చూసే దాకా నాలో రాగ రస జ్వాల ఇంకా రగులుతూనే ఉందని నాకు తెలీదు. ప్రేమ తరంగాలు ఇంత బలంగా ఈ బలహీనమైన గుండెని తాకుతాయని అనుకోనేలేదు.'

'చాలు మోహినీ, చాలు! నీ ఈ ప్రేమికుడు ధన్యుడు.'

ఏ విధమైన వ్యామోహం లేని ఈ ప్రేమ గుండెని గిలిగింతలు పెడుతోంది. అచ్చమైన వెన్నెల తరగల్లాటి నీ ప్రేమ - రజనీ - నన్ను - నా ప్రేమని - నా జన్మని ధన్యం చేసింది. రసహీనతతో ముడిపడి నీరసించి పోయిన బ్రతుకు తిరిగి రసించింది.'

'భగవంతుడు నిర్దయుడు, దయావంతుడు.'

'కరుణామయుడు. గుండెలో గుబులుని సేదదీర్చాడు. ప్రేమకోసం ఆర్తిగా అలమటించే రెండు హృదయాలను చేరువ చేశాడు.

అతను చప్పున ఆమె పాదాలని స్పృశించాడు. 'దేవీమూర్తిలాటి నీ చరణాలు నా మనో మందిరంలో సుప్రతిష్ఠతమయ్యాయి. ఈ దాసుడు తరించాడు. నీ ప్రేమకి - రాగభావనకి పాదాభివందనం చేస్తున్నాను.

ఆమె అతని చేయిని అలాగే స్పృశించింది. ఇద్దరిలోనూ స్పందన లేదు. శాంతించిన కడలి కెరటాల్లా ఉన్నాయి మనస్సులు.

'మనం ఏ జన్మలోనో శాపగ్రస్తులం.'

ఆమె అతని పెదాలని అరచేత్తో మూసింది. తలిరాకు జొంపాల్లాగా ఉన్న ఆ పెదాల స్పర్శ ఆమెకి పరమ శీతలంగా - హృద్యంగా ఉంది. 'మనం అదృష్టవంతులం. జన్మాదిగా వెదుక్కుంటూ ప్రవహిస్తోన్న ప్రేమవాహిని ప్రణయ సాగరాన్ని చేరుకున్నది' ఆమె గొంతులో కోటి వ్రతాలు ఫలించిన తృప్తి.

'నిజం! అతని కళ్ళు మిలమిల్లాడాయి. 'మోహినీ!'

'రజనీ! నేను ఈ పిలుపుకి కూడా నోచుకో లేదంటే నమ్ముతావా! నువ్వలా పిలుస్తూ ఉంటే నా నరాల ప్రణయ రహదారుల్లో వలపుటేరులు పరిగెడుతున్నాయి. జన్మ తరించింది. మనది నిషిద్ధ ప్రేమ . వ్యామోహం - కాదు. జన్మ జన్మల బంధం.

'మోహినీ! నా తపస్సు ఫలించింది. ఇన్నేళ్ళుగా కలలు కంటున్న స్త్రీ మూర్తివి నువ్వు. గాయత్రీ దేవి ప్రత్యక్షమైనట్టు, శ్రీ విద్యాధిదేవత స్వప్న సాక్షాత్కారమైనట్టు ఉంది. నీకు మరోసారి పాదాభివందనం చేస్తున్నాను. స్త్రీ అమృతమూర్తి, అనురాగమూర్తి అని మరో పర్యాయం రుజువు చేశావు.

'నా గుండె సేదదీరింది, రజనీ! విన్నవించలేక, మనస్సులో దాచుకోలేక ఎంతగా తపించానని!'

'నా జన్మ జన్మల చెలీ! నేను సగంలో తపంచెడిన భక్తుడిని. వచ్చే జన్మ మనదే! నిశ్చలమైన మనస్సుతో తపస్సు చేస్తాను. కనుగొన్న నిన్ను విడువలేను.'

'అంతరంగ ద్వారాన్నయినా చేరలేని మనుషులతో జీవించిన నాకు నా అంతరంగాన్ని కదలించిన ప్రేమమూర్తిగా నీవు లభించావు - ఈ జన్మకిది చాలు.'

అతను ఆమె చేయి అందుకున్నాడు. వెచ్చని రక్తం అతినెమ్మదిగా రాగవాహినిలా ప్రవహిస్తోంది. దేవీసన్నిధిలో మనస్సు శాంతించినట్టుగా ఉంది.

ఆమె మనస్సులో ప్రేమతరంగాలు అతణ్ణి అభిషేకిస్తున్నాయి. వలపు వాహిని గమ్యం చేరుకున్నది.

● 13-10-82 ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ●